క్లుప్తంగా

ఇరిగేషన్ ఎస్ఈగా గంగయ్య



చిలకలపూడి(మచిలీపట్నం): జలవనరులశాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్‌గా పి.గంగయ్య బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఎస్ఈగా చేసిన ప్రసాద్ ఇంజినీర్ ఇన్ చీఫ్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఈ స్థానంలో స్పెషల్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పని చేస్తున్న గంగయ్యకు ఎస్ఈగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ నేపథ్యంలో ఆయన గురువారం కలెక్టర్ డీకే బాలాజీని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు.

రేషన్ పంపిణీ పరిశీలన



తాడేపల్లి(ఘంటసాల): అర్హులైన రైస్‌కార్డు దారులకు ప్రభుత్వం అందిస్తున్న రేషన్ బియ్యాన్ని ప్రజలు తీసుకోవాలని తహసీల్దార్ బి.విజయ ప్రసాద్ అన్నారు. మండల పరిధిలోని ఎండీయూ వాహనం ద్వారా జరుగుతున్న రేషన్ పంపిణీని గురువారం తహసీల్దార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఇప్పటి వరకు సుమారుగా 61 శాతం మందికి రేషన్ పంపిణీ చేశారని, మిగిలిన వారు కూడా తీసుకోవాలని కోరారు. ఎండీయూ వాహనదారులు రేషన్ పంపిణీ నూరుశాతం పూర్తి చేయాలని ఆదేశించారు.

కుట్టు, మగ్గం శిక్షణను వినియోగించుకోండి



పెడన: సహాయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా కుట్టుమిషన్, మగ్గం వర్క్‌లపై నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను వినియోగించుకోవాలని సహాయ ఫౌండేషన్ విద్యావిభాగం కమిటీ చైర్మన్ మట్టా రాధాకృష్ణమూర్తి అన్నారు. ఉచిత కుట్టుమిషన్, మగ్గం శిక్షణ తరగతుల 8వ బ్యాచ్‌ను గురువారం పెడన గుడివాడ రోడ్డులోని షాదీఖానాలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెడన పరిసర ప్రాంత పేద, మధ్య తరగతి మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఫౌండేషన్ అధ్యక్షుడు ఉస్మాన్‌బాషా మాట్లాడుతూ 50 రోజుల పాటు జరిగే శిక్షణలో పెద్ద ఎత్తున మహిళలు ఈ అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని కోరారు. ఆసక్తి ఉన్నవారు 86882 35377, 83742 11399లో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో కోన వెంకటేశ్వరమ్మ, రౌతుల ప్రసాద్, తాత సాయిరాం, కుర్షీద్ బేగం, నూర్జహాన్, తోట విజయ కుమారి, దుర్గా భవాని తదితరులు పాల్గొన్నారు.

కోడూరు తహసీల్దార్‌గా శ్రీనునాయక్



కోడూరు: కోడూరు తహసీల్దార్‌గా శ్రీనునాయక్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన శ్రీనివాసరావు అల్లూరు సీతారామరాజు జిల్లాకు బదిలీపై వెళ్లారు. శ్రీనునాయక్ బదిలీపై కోడూరుకు రాగా, రెవెన్యూ సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పరిశె మాధవరావు, జిల్లా రైతు విభాగం కార్యదర్శి కొండవీటి వీరవెంకటనారాయణరావు, ఎస్సీసెల్ కన్వీనర్ వెన్నా ప్రసాద్, ఎంపీటీసీలు బడే గంగాధరరావు, తిమ్మన నాంచారయ్య, వైస్ సర్పంచి ఇంకొల్లు మురళీకృష్ణ తహసీల్దార్‌ను కలిసి శాలువా కప్పి సత్కరించారు. డీటీ పద్మప్రియ, ఆర్ఐ సుభాషిణి, వీఆర్వోలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో లక్ష తులసి పూజ



పమిడిముక్కల: మంటాడ శ్రీ అలివేలు మంగా పద్మావతీ సమేత వైకుంఠ వేంకటేశ్వరస్వామి వారి ఆగమన మహోత్సవాలు రెండో రోజు గురువారం వైభవంగా జరిగాయి. లక్ష తులసి పుష్పాలతో అర్చన చేశారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. భక్తులకు అన్న ప్రసాదం అందజేశారు. ఆలయ ఈవో మాధవీలత ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మేం చెప్పిందే వినాలి.. మా వారే ఉండాలి

అంతా మా ఇష్టం
- ఎస్ఎంసీ ఎన్నికల్లో చక్రం తిప్పిన 'కూటమి' స్థానిక నేతలు
- పాతవారు ఏకగ్రీవమైన చోట మార్పులు..
- ఎన్నికలు రద్దు.. వాయిదా
- వత్తాసు పలికి హెచ్ఎంలు... మండల అధికారులు
- వాయిదా వేయాలని ఆదేశాలతో తక్షణ చర్యలు



పెడన బంగ్లాస్కూలులో ఎస్ఎంసీ చైర్మన్, వైస్‌చైర్మన్‌గా ఎన్నికైన వారికి పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న హెచ్ఎం పక్కన టీడీపీ నాయకులు

పెడన: పాఠశాలలో రాజకీయ జోక్యం ఉండకూడదనే విషయం తెలిసి కూడా ఎన్డీఏ కూటమి స్థానిక నాయకులు ఆ దిశగా అడుగులు వేయడం ఇటు తల్లిదండ్రులను, అటు ఉపాధ్యాయులను విస్మయానికి గురిచేస్తోంది. 'పెడన' వ్యాప్తంగా గురువారం స్కూల్ మేనేజిమెంట్ కమిటీ ఎన్నికలను నిర్వహించారు. కొన్నిచోట్ల సజావుగా సాగినా.. టీడీపీ నాయకుల రంగ ప్రవేశంతో అది కాస్తా మార్పులు చేర్పులకు చోటు చేసుకోవడమే కాకుండా వాయిదా వేసిన ఘటనలూ అక్కడక్కడ జరిగాయి. మాట చెల్లుబాటు కాని చోట ఎన్నికలను వాయిదా వేశారు. కొన్నిచోట్ల ఎన్నికలైన వాటిని కూడా వాయిదా వేయడం గమనార్హం.

ఓటింగ్ సమయంలో.. టీడీపీ నేతలు!

విద్యార్థుల తల్లిదండ్రులు మాత్రమే పాఠశాలలో జరిగే ఎన్నికలకు హాజరు కావాల్సి ఉంది. అయితే టీడీపీ నాయకులు ఎటువంటి ఓటు హక్కు లేకపోయినా ఆయా స్కూళ్లకు వెళ్లి ఓటర్లు భయభ్రాంతులకు గురయ్యేలా ఓటింగ్ సమయంలో పాఠశాలల్లోనే ఉండటం కనిపించింది. ఇటు విద్యాశాఖాధికారులు, అటు హెచ్ఎంలు కూడా అభ్యంతరం వ్యక్తం చేయకపోవడం గమనార్హం. పెడన మండలంలో 64 పాఠశాలలుండగా 8 జెడ్పీ హెచ్ఎస్, ఏడు యూపీఎస్, 49 ఎలిమెంట్రీ స్కూల్స్ ఉన్నాయి. వీటన్నింటికీ ఎన్నికలను విద్యాశాఖ నిర్వహించింది. మూడో నుంచి పదో వరకు తరగతికి ముగ్గురు చొప్పున 24 మంది ఓటింగ్‌లో పాల్గొనేలా హెచ్ఎంలు చర్యలు తీసుకున్నారు.

బంగ్లా స్కూల్లో..

పెడన పట్టణంలోని బంగ్లా స్కూలు(14వ వార్డులో ప్రాథమిక పాఠశాల)లో గత కమిటీలో చైర్మన్‌గా ఉన్న బాబును తిరిగి విద్యార్థుల తల్లిదండ్రులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అయితే టీడీపీ నాయకులు రంగ ప్రవేశం చేసి బాబును చైర్మన్‌గా వద్దని చెప్పారు. దీంతో మహిళను చైర్మన్‌గా టీడీపీ నాయకులు చేశారు. అధికార పార్టీ నాయకులతో గొడవ ఎందుకులే అని బాబు వైస్ చైర్మన్‌గా ఉండటానికి ఆసక్తి చూపించారు. దీంతో పరిస్థితి గొడవకు దారితీయకుండా టీడీపీ ఎత్తుగడ ఫలించింది.

భట్టజ్ఞానకోటయ్య జెడ్పీహెచ్ఎస్‌లో

పెడన భట్టజ్ఞానకోటయ్య జెడ్పీహెచ్ఎస్‌లో ఆరు గురు చైర్మన్ రేసులో పాల్గొనగా బ్యాలెట్ ద్వారా ఎన్నిక నిర్వహించారు. ఇది కూడా అనుమానాస్పదంగా ఉందనేది పలువురు వాదన. అన్ని చోట్ల చేతులు ఎత్తి ఎన్నిక నిర్వహిస్తే పెడన బీజీకేజడ్పీహెచ్ఎస్‌లో 24 ఓట్లకు బ్యాలెట్ ఉపయోగించడం ఏంటనే వాదన వ్యక్తమవుతోంది.



పెడన బీజీకే జెడ్పీహెచ్ఎస్‌లో నూతన కమిటీతో హెచ్ఎం, టీడీపీ నేతలు (బంగ్లాస్కూలు వద్ద కూడా)

మల్లవోలు జెడ్పీహెచ్ఎస్‌లో

గూడూరు మండలం మల్లవోలు జెడ్పీహెచ్ఎస్‌లో ఆంజనేయులు అనే వ్యక్తికి 24 ఓట్లకు 19 ఓట్లు పోలయ్యాయి. చైర్మన్‌గా ఆంజనేయులు పేరును అధికారికంగా ప్రకటించి సంతకాలు సేకరించే సమయానికి టీడీపీ నాయకులకు సమాచారం తెలిసి ఉన్నతాధికారుల నుంచి ఫోన్ చేయించడంతో ఎన్నికను హెచ్ఎం కె.అరుణ రద్దు చేసి వాయిదా వేశారు. దీనిపై గూడూరు ఎంఈవో, ఇన్‌చార్జి డీవైఈవో శేఖర్ సింగ్ మాట్లాడుతూ ఓటు వేయడానికి వచ్చిన వారు సంతకాలు చేసి వెళ్లిపోవడంతో కోరం లేక ఈ ఎన్నికను వాయిదా వేసినట్లు హెచ్ఎం పేర్కొన్నారని తెలిపారు. ఏది ఏమైనా రాజకీయాలకు అతీతంగా జరగాల్సిన ఎస్ఎంసీ ఎన్నికలు టీడీపీ నాయకుల ప్రవేశంతో పాఠశాలలకు కూడా రాజకీయ రంగు అద్దుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

గూడూరు: అధికారపార్టీ నాయకుల కనుసన్నల్లో గూడూరు మండలంలో పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు గురువారం జరిగాయి. మండలంలో 44 ప్రాథమిక పాఠశాలలకు 24 చోట్ల ఏకగ్రీవం అయ్యాయి. మిగిలిన 20 ప్రాథమిక పాఠశాలల్లో ఎన్నికలు జరిగాయి. మండలంలో 8 ప్రాథమికోన్నత పాఠశాలలు ఉండగా, 3 చోట్ల ఎన్నికలు ఏకగ్రీవం కాగా, 5 పాఠశాలల్లో ఎన్నికలు జరిగాయి. ఏడు జెడ్పీ ఉన్నత పాఠశాలలకు ఆరు చోట్ల ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి.

బంటుమిల్లి: మండల పరిధిలోని 21 గ్రామ పంచాయతీల్లోని 56 ప్రభుత్వ పాఠశాలల యాజమాన్య కమిటీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా ముగిసినట్లు ఎంఈఓ బి. త్రిపురసుందరీదేవీ తెలిపారు.

కృత్తివెన్ను: మండల పరిధిలోని 11 ఉన్నత పాఠశాలలు, 6 ప్రాథమికోన్నత పాఠశాలలు, 50 ప్రాథమిక పాఠశాలల్లో ఎన్నికలు జరిగినట్లు ఎంఈవో ప్రసాదరావు తెలిపారు.

అవనిగడ్డ నియోజకవర్గంలో..

మోపిదేవి: మండల పరిధిలోని 42 పాఠశాలల్లో స్కూల్ మేనేజిమెంట్ కమిటీ(ఎస్ఎంసీ)ఎన్నికలు గురువారం ప్రశాంతంగా నిర్వహించినట్లు ఎంఈవో-1 ఎస్.దుర్గా సాగర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 40 పాఠశాలల్లో ఏకగ్రీవంగా ఎన్నికలు జరగగా, ఉత్తరపాలెం ప్రాథమిక పాఠశాల, మోపిదేవి గురుకుల పాఠశాలలో మాత్రం ఓటింగ్ పద్ధతిలో ఎన్నిక జరిగినట్లు చెప్పారు. మోపిదేవి జెడ్పీ పాఠశాలలో తొలుత 15 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం ఆ కమిటీ సభ్యులు ఎస్ఎస్‌సీ కమిటీ చైర్మన్‌గా చిరువోల్లంక లక్ష్మి, వైస్ చైర్మన్‌గా కర్లపూడి కిషోర్‌ను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన చైర్మన్, వైస్ చైర్మన్‌లు ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించారు.

కోడూరు: మండలంలోని 41 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఆరు జెడ్పీ పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయుల పర్యవేక్షణలో ఎన్నికలు జరిపారు. 90 శాతం పైగా పాఠశాలల్లో కమిటీ చైర్మన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎంఈఓ టి.వి.ఎం.రామదాసు తెలిపారు. 10 శాతం పాఠశాలల్లో మాత్రమే చైర్మన్ పదవికి ఎన్నిక జరిగిందని తెలిపారు.

గోగినేనిపాలెం(ఘంటసాల): గోగినేనిపాలెం గ్రామంలోని జెడ్పీ హైస్కూల్, ఎంపీపీ స్కూల్లో పేరెంట్స్ కమిటీ ఎన్నికలు గురువారం నిర్వహించారు. కమిటీ చైర్మన్లుగా కుంపటి జీవన్ కుమార్, పోగుల శివనాగమణి ఎన్నికయ్యారు.

సమన్వయంతో పని చేయాలి

జెడ్పీ సీఈవో డాక్టర్ ఆర్‌సీ ఆనంద్‌కుమార్

ఘంటసాల: పంచాయతీల అభివృద్ధికి సర్పంచ్, కార్యదర్శులు సమన్వయంతో పని చేయాలని జెడ్పీ సీఈవో డాక్టర్ ఆర్‌సీ ఆనంద్‌కుమార్ చెప్పారు. ఘంటసాల మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ విధులు, నిధులు, అధికారాలు అనే అంశం పై మండల పరిధిలోని సర్పంచ్‌లకు, కార్యదర్శులకు ఎంపీడీవో బి.మారుతీ శేషమాంబ ఆధ్వర్యంలో మూడు రోజుల శిక్షణ తరగతులను గురువారం ప్రారంభించారు. వీటిని జెడ్పీ సీఈవో ఆనంద్ కుమార్ సందర్శించి మాట్లాడుతూ పంచాయతీలను బలోపేతం చేయడానికి, పర్యావరణ పరిరక్షణ, పారిశుద్ధ్యం గ్రామస్థాయి నుంచి ప్రారంభించాలని దీనిపై ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రత్యేక దృష్టి సారించారన్నారు. వర్మీకంపోస్టు, చెత్త నుంచి సంపద కేంద్రాలద్వారా పంచాయతీలకు ఆదాయం రావడంతో పాటు తడి, పొడి చెత్తను వేరు చేసే విధానంపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ఎంపీడీఓవో మారుతీ శేషమాంబ ఆధ్వర్యంలో సీఈవో ఆనంద్ కుమార్‌ను కార్యాలయ సిబ్బంది, సర్పంచ్‌లు శాలువాలు కప్పి సత్కరించారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఏవో కేజే శ్రీనివాస చంద్, ఈఓపీఆర్డీ గుత్తికొండ కిషోర్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

సర్పంచులు, కార్యదర్శులదే కీలకపాత్ర

గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌లు, కార్యదర్శులదే కీలకపాత్రని డీఎల్పీవో ఐ.జ్యోతిర్మయి అన్నారు. ఘంటసాల మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు గ్రామ పంచాయతీ విధులు, నిధులు, అధికారాలపై ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న మూడు రోజుల శిక్షణ తరగతులను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎల్పీవో మాట్లాడుతూ పంచాయతీల్లో పారిశుద్ధ్యం, తాగునీటి నిర్వహణ, గ్రామ పంచాయతీ సమావేశాలు, జీపీడీపీ నిధులపై అవగాహన, సక్రమంగా ఉపయోగించడం, సక్రమంగా వినియోగించిన వారికి ప్రోత్సాహకాలు అందజేస్తారని తెలిపారు. అనంతరం చల్లపల్లి, మోపిదేవి, అవనిగడ్డ మండల పరిషత్‌ల్లో జరుగుతున్న శిక్షణను పరిశీలించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ట్రైనర్స్‌గా ఈఓపీఆర్డీ గుత్తికొండ కిషోర్, చిట్టూర్పు పంచాయతీ కార్యదర్శి నెమలికంటి శ్రీలక్ష్మి కృష్ణవేణి వ్యవహరించగా 22 గ్రామాలకు చెందిన సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



ఘంటసాలలో జెడ్పీ సీఈవో ఆనంద్‌కుమార్‌ను సత్కరిస్తున్న అధికారులు



పంచాయతీ కార్యదర్శులను ఉద్దేశించి మాట్లాడుతున్న డీపీవో నాగేశ్వరనాయక్

విధివిధానాలపై అవగాహన పెంచుకోవాలి

పెడన: పంచాయతీల్లో విధివిధానాలు, బాధ్యతలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించడానికి ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులకు సర్పంచులందరూ హాజరయ్యేలా వారి వారి పరిధిలోని పంచాయతీ కార్యదర్శులు చొరవ తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి ఎంవీ నాగేశ్వరనాయక్ అన్నారు.

ఆయన పెడన, గూడూరు మండల పరిషత్ కార్యాలయాల్లో గురువారం సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు మూడు రోజులు పాటు జరిగే ప్రారంభం రోజు శిక్షణ తరగతులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రెడ్డయ్య, ఈవోపీఆర్డీ జయరాం, ఏవో శిరీష, గూడూరులో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో ప్రేమాన్విత, ఈవోపీఆర్డీ రాజేశ్వరి, ఏవో వనజ తదితరులు పాల్గొన్నారు.

మోపిదేవి: మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సర్పంచ్, కార్యదర్శుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ నడకుదుటి జనని కుమారి అధ్యక్షతన ఎంపీడీవో రామలింగేశ్వరావు ఆధ్వర్యంలో మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ముఖ్యఅతిథి డీఎల్‌పీవో జ్యోతిర్మయి పాల్గొన్నారు.

ఘనంగా పోతురాజు సంబరాలు



మోపిదేవి: స్థానిక గౌడపాలెం రామాలయం వద్ద పోతురాజు సంబరాలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున పోతురాజు శిలలతో ఊరేగింపుగా మేళతాళాలు, డప్పుకళాకారులు సందడితో ఆలయానికి చేరుకున్నారు. గౌడసంఘం ఆధ్వర్యంలో మహిళలు ఇంటి వద్ద చేసిన నైవేద్యాలను ఆలయానికి సామూహికంగా తీసుకువచ్చి స్వామివారికి సమర్పించారు. రెండు రోజుల పాటు పోతురాజు సంబరాలు ప్రశాంతంగా జరిగినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి వెండి గిన్నె సమర్పణ



మోపిదేవి: స్థానిక శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి విజయవాడ వాస్తవ్యులు బిట్ర చంద్రశేఖర్ తన కుమార్తె పూజశ్రీ పేరున 1.40 కిలోల వెండి గిన్నెను కానుకగా సమర్పించుకున్నారు. ఉదయం ఆలయానికి వచ్చిన వారు తొలుత స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకం చేయించుకున్నారు. అనంతరం ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావుకు వెండి గిన్నెను అందజేశారు. ఈ సందర్భంగా దాతను ఆలయ మర్యాదలతో సత్కరించారు.

ఈ క్రాప్‌లో విత్తన వివరాలు

మల్లంపల్లి(ఘంటసాల): రైతులు వేసిన పంట వివరాలతో పాటు ఏ విత్తనం వేశారో తప్పని సరిగా ఈ క్రాప్‌లో నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి కె.మురళీకృష్ణ అన్నారు. ఘంటసాల మండలం మల్లంపల్లి పంచాయతీ శివారు బోల్లపాడు గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యాన గురువారం ఈ క్రాప్ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మురళీకృష్ణ మాట్లాడుతూ ఖరీఫ్ 2024 సీజన్‌లో సాగు చేసిన పంట, విత్తన రకంతో సహా రైతుల వివరాలను రైతు సేవా కేంద్రం సిబ్బంది ద్వారా ఈ క్రాప్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు. దీంతో ధాన్యం సేకరణ, ప్రకృతి విపత్తులతో, కరువు కారణంగా పంటకు నష్టం జరిగిన సందర్భంలో ఇన్‌పుట్ సబ్సిడీ, బీమా, రుణాలు, ఎరువులు, పరుగు మందుల కొనుగోలు, రాయితీ, తదితర అవసరాలకు ఉపయోగపడుతుందన్నారు. వీఏఏ బి.దిలీప్, రైతులు రత్నగిరిరావు, సతీష్ పాల్గొన్నారు.



బోల్లపాడులో ఈ క్రాప్ నమోదు పరిశీలిస్తున్న ఏవో మురళీ కృష్ణ

ఘనంగా తిరంగా ర్యాలీ



ఎలకుర్రు(పామర్రు): మండలంలోని ఎలకుర్రు గ్రామంలో కాశీనాథుని దుర్గాంబ, బుచ్చయ్య ట్రస్టు మానసిక దివ్యాంగుల విద్యార్థులతో గురువారం తిరంగా ర్యాలీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ట్రస్టు నిర్వాహకుడు కాశీనాథుని నాగేశ్వరరావు మాట్లాడుతూ భారత దేశం సుసంపన్నమై ప్రపంచంలోని అగ్రరాజ్యాలతో పోటీ పడుతూ ఆర్థికంగా, సాంకేతికంగా అగ్రగామి కావాలని ఆకాంక్షించారు. భారతదేశం మువ్వన్నెల జెండా ప్రపంచం గర్వించేలా ఎగరాలని నినాదాలు చేస్తూ గ్రామ పురవీధుల్లో ర్యాలీలు నిర్వహించారు. ఈ ర్యాలీలో కేడీబీ ట్రస్టు డీఎడ్ స్పెషల్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపాల్ వై.ప్రసన్నకుమారి, దివ్యాంగుల పాఠశాల ప్రిన్సిపాల్ డి.వసుంధర, కళాశాల విద్యార్థులు, మానసిక దివ్యాంగులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కృష్ణా నది వద్ద అప్రమత్తం

శ్రీకాకుళం(ఘంటసాల): మండల పరిధిలోని కృష్ణానది పరీవాహక ప్రాంత రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ బూసి విజయ ప్రసాద్ సూచించారు. ప్రకాశం బ్యారేజీ నుంచి కృష్ణానదిలోకి వరద నీరు వదలడంతో దిగువ ప్రాంతాలైన ఘంటసాల మండలంలోని శ్రీకాకుళం, పాపవినాశనం గ్రామాల్లోని కృష్ణానది పరీవాహక ప్రాంతాలను రెవెన్యూ అధికారులతో కలసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రకాశం బ్యారేజీ నుంచి సుమారు 2.93 లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేయడంతో శ్రీకాకుళం, పాపవినాశనం, గోగినేనిపాలెం వద్ద వరద ఉధృతి పెరిగిందన్నారు. శ్రీకాకుళం నదిలో నుంచి గుంటూరు జిల్లాకు వెళ్లే దారి మునిగిపోయిందని తెలిపారు. ప్రయాణాలు నిలిపివేయడంతో పాటు శ్రీకాకుళం, పాపవినాశనం లంకల్లో పొలాల నిమిత్తం రైతులు వెళ్లేందుకు అనుమతులు లేవని చెప్పారు. కొంతమంది రైతులు పట్టు పురుగుల పంటలు పరిశీలించడానికి వెళ్లాలని కోరారు. వరద ఉధృతి తగ్గేంత వరకు ఎవరూ వెళ్లడానికి వీల్లేదని, పశువులను, మేకలను, ఇతర వ్యవసాయ పనుల నిమిత్తం ఎవరూ నదిపరీవాహక ప్రాంతాలకు వెళ్లకుండా చూడాలని స్థానిక అధికారులను ఆదేశించారు. శ్రీకాకుళం, పాపవినాశనంలోని ఆయా గ్రామాల వీఆర్వోలను, వీఆర్ఏలతో పాటు పోలీసు సిబ్బందిని కూడా నియమించాలని ఎస్ఐ కె.ప్రతాప్‌రెడ్డిని కోరినట్లు చెప్పారు. కార్యక్రమంలో రీ సర్వే డీటీ పి.శ్రీనివాసరావు, సర్వేయర్ సీహెచ్ వల్లీపుష్ప, వీఆర్వోలు తూము శ్రీనివాసరావు, శివప్రసాద్, సర్వేయర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



పాపవినాశనం వద్ద కృష్ణానది ఉధృతిని పరిశీలిస్తున్న తహసీల్దార్ విజయ ప్రసాద్

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే చర్యలు

- ఉయ్యూరు డివిజన్ ఈఈ డి.కృష్ణ నాయక్
- ఘంటసాలలో విద్యుత్ విజిలెన్స్ దాడుల్లో రూ.8.20 లక్షల జరిమానా

ఘంటసాల: విద్యుత్ చౌర్యానికి పాల్పడితే చర్యలు తప్పవని ఉయ్యూరు డివిజన్ విద్యుత్ శాఖ ఈఈ డి.కృష్ణ నాయక్ అన్నారు. ఘంటసాల మండలంలో ఉయ్యూరు డివిజన్ విద్యుత్ శాఖ ఈఈ కృష్ణా నాయక్ పర్యవేక్షణలో విజిలెన్స్ ఈఈ కె.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో 31 బృందాలు గురువారం దాడులు నిర్వహించాయి. ఈ సందర్భంగా ఘంటసాల మండలంలోని కొడాలి కల్యాణ మండపంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఈఈలు కృష్ణా నాయక్, వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మండలంలోని 1,608 గృహ సర్వీసులు, 77 వాణిజ్య సముదాయాలు, ఏడు ఆక్వా సర్వీసులను తనిఖీ చేశారు. వీటిలో 285 సర్వీసులకు చెందినవారు 412 కిలోవాట్లు అదనపు విద్యుత్ వినియోగిస్తున్నట్లు గుర్తించగా వారికి రూ.8.20 లక్షలు జరిమానాగా విధించినట్లు చెప్పారు. మీ ప్రాంతాల్లో విద్యుత్ చౌర్యం జరిగినట్లయితే 94408 12362, 94408 12363, 83310 14951 నంబర్లకు సమాచారం అందించాలని, ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. తనిఖీల్లో చల్లపల్లి, ఉయ్యూరు, అవనిగడ్డ డీఈఈలు పీఎస్ నాగేశ్వరరావు, ఎం.రామకృష్ణ, ఎన్.సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఘంటసాల ఏఈ పి.రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉయ్యూరు డివిజన్ ఈఈ కృష్ణ నాయక్, విజిలెన్స్ ఈఈ వెంకటేశ్వర్లు తదితరులు

ఆ విద్యాసంస్థల గుర్తింపు రద్దు చేయండి

ఎస్ఎఫ్ఐ కృష్ణాజిల్లా కమిటీ కార్యదర్శి సమరం

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో రాత్రి 8 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల గుర్తింపు రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ కృష్ణాజిల్లా కమిటీ కార్యదర్శి సమరం డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం డీఈవో కార్యాలయంలోని విద్యాశాఖ అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ వి. మనోహర్‌నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. మచిలీపట్నంలోని ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఒక్క పాఠశాల కూడా విద్యాశాఖ ఉత్తర్వులు అమలు చేయడం లేదని చెప్పారు. ఉదయం 7.40 నుంచి రాత్రి 8 గంటల వరకు ప్రత్యేక తరగతుల పేరుతో క్లాసులు నిర్వహిస్తున్నారని తెలిపారు. అటువంటి విద్యాసంస్థలను గుర్తించి వాటి గుర్తింపును రద్దు చేయాలని, వచ్చే సంవత్సరం నుంచి అడ్మిషన్లు తీసుకోకుండా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. విద్యాసంవత్సరం ప్రారంభంలోనే ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు విచ్చలవిడిగా అధిక, స్పెషల్ ఫీజులతో పాటు అధిక ధరలకు యూనిఫాం, నోట్‌పుస్తకాలు, టెక్స్ట్ పుస్తకాలు విక్రయిస్తున్నారన్నారు. వీటిపై విద్యాశాఖాధికారులు ఏ మాత్రం చర్యలు తీసుకోవడం లేదని చెప్పారు. అర్జీ ఇచ్చిన వారిలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కీర్తి ఉన్నారు.



విద్యాశాఖ ఏడీ మనోహర్‌నాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

సమస్యల పరిష్కారానికి ఐక్యంగా ముందుకు..

అఖిలపక్ష సమావేశంలో ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

అవనిగడ్డ: నియోజకవర్గంలో సమస్యల పరిష్కారానికి ఐక్యంగా ముందుకెళ్దామని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ చెప్పారు. స్థానిక గాంధీక్షేత్రంలో గురువారం అఖిల పక్ష పార్టీల నేతలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి ఎవరు ఎలాంటి సూచనలు ఇచ్చినా వాటిని ముందుకు తీసుకెళ్లి పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. గతంలో ఐక్య పోరాటాల ద్వారా ఎన్నో సాధించామని గుర్తు చేశారు. ఈ సందర్భంగా వివిధ పార్టీల నాయకులు పలు సమస్యలను వివరించారు. సమావేశంలో జనసేన నేత మండలి వెంకట్రామ్(రాజా), మోపిదేవి జెడ్పీటీసీ మెడబలిమి మల్లికార్జునరావు, టీడీపీ, జనసేన, సీపీఎం, సీపీఐ, కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

లింగ వివక్ష లేకుండా చూడాలి

మండవల్లి: బాల బాలికల మధ్య లింగ వివక్ష లేకుండా చూడాలని ఐసీడీఎస్ గన్నవరం సెక్టార్ సూపర్‌వైజర్ బి.ప్రసన్న అన్నారు. మిషన్‌శక్తి వంద రోజుల ప్రత్యేక అవగాహన కార్యక్రమం పుట్లచెరువు సచివాలయ పరిధిలోని అంగన్‌వాడీ సెంటర్-1లో గురువారం నిర్వహించారు. పీసీపీఎన్‌డీటీ యాక్ట్ గురించి ఆమె వివరించారు. జీఎంఎస్‌కే ఎ.రజిత మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయరాదని, బాల బాలికలనందరినీ చదివించాలని సూచించారు. హైస్కూల్ హెచ్ఎం మాట్లాడుతూ బాల బాలికలను సమానంగా చూడాలన్నారు. గన్నవనం సెక్టార్ అంగన్‌వాడీ కార్యకర్తలు, కిశోర బాలికలు, ఉపాధ్యాయులు, తల్లులు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

గణపతి నవరాత్రుల రాతా ఏర్పాటు



గుడివాడ టౌన్: స్థానిక మెయిన్ రోడ్డులో ఉన్న శ్రీ విఘ్నేశ్వర స్వామి వారి దేవస్థానంలో గురువారం నవరాత్రి మహోత్సవ రాతా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ వీడీడీ ప్రసాద్ మాట్లాడుతూ సెప్టెంబర్ 7 నుంచి 15వ తేదీ వరకు శ్రీ గణపతి నవరాత్రి మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు కపిలవాయి గోపాల శాస్త్రి, ఆలయ ఉద్యోగులు శ్రీనివాస్, నారాయణ, భక్తులు పాల్గొన్నారు.